క్లుప్తంగా

ఎమ్మెల్యే అభ్యర్థిగా అవకాశం ఇవ్వాలి



కిషన్‌రెడ్డికి దరఖాస్తు అందజేస్తున్న రఘుబాబు

ఫెర్టిలైజర్‌సిటీ: నియోజకవర్గ బీజేపీ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థిగా అవకాశం ఇవ్వాలని సోమవారం బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి, బండి సంజయ్‌కి బీజేపీ యువ మోర్చా రామగుండం కార్పొరేషన్ అధ్యక్షుడు కాంపల్లి రఘుబాబు దరఖాస్తు అందజేశారు. ఎమ్మెల్యే టికెట్ విషయమై కిషన్‌రెడ్డి సానుకూలంగా స్పందించారని రఘుబాబు తెలిపారు.

కాంగ్రెస్‌లో చేరిక



కాంగ్రెస్‌లో చేరిన వారితో ఎమ్మెల్యే శ్రీధర్‌బాబు

ముత్తారం: మండలంలోని ఖమ్మంపల్లి, జిల్లాలపల్లి, రంగయ్యపల్లి, సందరెల్లి గ్రామాల బీఆర్ఎస్ చెందిన సుమారు 50మంది పైగా సోమవారం పెద్దపల్లిలో మంథని ఎమ్మెల్యే, కాంగ్రెస్ మెనిఫెస్టో కమిటీ చైర్మన్ దుద్దిళ్ల శ్రీధర్‌బాబు సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షుడు చొప్పరి సదానందం, మండల అధ్యక్షుడు దొడ్డ బాలాజీ, నాయకులు అల్లం కుమారస్వామి, మొగిళి, శ్రీను, కొలిపాక శంకర్, తీర్థాల సురేందర్, అక్కపాక సతీశ్, పెట్టం స్వామి, సమ్మయ్య, తదితరులు పాల్గొన్నారు.

'గుణసుందరి కథ'ను ఆదరించండి

కోల్‌సిటీ(రామగుండం): గోదావరిఖనికి చెందిన ఓంప్రకాశ్ మార్త దర్శకత్వంలో తెరకెక్కిన గుణసుందరి కథ తెలుగు సినిమాను అందరూ ఆదరించాలని రామగుండం మున్సిపల్ కార్పొరేటర్స్ ఫోరం అధ్యక్షుడు కన్నూరి సతీశ్‌కుమార్ కోరారు. సోమవారం స్థానిక శ్రీనివాస థియేటర్ ఆవరణలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో డైరెక్టర్ ఓంప్రకాశ్ మార్తను అభినందించారు. కార్యక్రమంలో నాయకులు పద్మగణేశ్, కాల్వశ్రీనివాస్, శ్రీనివాశ్, రవిగౌడ్, రవీందర్ రెడ్డి, మండలి సత్యనారాయణ పాల్గొన్నారు.

నియామకం

కమాన్‌పూర్: మండలంలోని జూలపల్లి గ్రామానికి చెందిన అడెపు రమేశ్‌ను కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శిగా నియమిస్తూ జిల్లా అధ్యక్షుడు మక్కాన్‌సింగ్ రాజ్ ఠాగూర్ సోమవారం ఉత్తర్వులు జారీచేశారు. ఎమ్మెల్యే దుద్దిళ్ల శ్రీధర్‌బాబు నియామకపత్రం అందజేశారు. గ్రామానికి చెందిన ఒకటో వార్డు సభ్యురాలు దాసరి లక్ష్మీ శంకర్ రమేశ్ ఆధ్వర్యంలో కాంగ్రెస్‌లో చేరారు.

కల్యాణలక్ష్మి చెక్కులు పంపిణీ

పాలకుర్తి: మండల పరిధిలోని పలు గ్రామాలకు చెందిన లబ్ధిదారులకు సోమవారం తహసీల్దార్ జ్యోతి కల్యాణలక్ష్మి చెక్కులు పంపిణీ చేశారు. మండలవ్యాప్తంగా 19 గ్రామ పంచాయతీల పరిధిలో మొత్తం 80 కల్యాణలక్ష్మి, 7 షాదీ ముబారక్ చెక్కులను లబ్ధిదారులకు అందజేశారు. కార్యక్రమంలో ఆర్ఐ.భానుకుమార్, సిబ్బంది కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

ఎంపీడీవో విచారణ

రామగిరి: మండలంలోని పన్నూర్‌లో సోమవారం ఎంపీడీవో రమేశ్ విచారణ చేపట్టారు. గ్రామానికి చెందిన ఇజ్జగిరి వెంకటేశ్ గృహలక్ష్మి పథకంలోని అనర్హులను గుర్తించి అర్హులకు న్యాయం చేయాలని కలెక్టర్‌కు ఫిర్యాదు చేయగా గ్రామంలోని లబ్ధిదారుల ఇంటికి వెళ్లి విచారణ చేపట్టారు.

రైస్‌మిల్ నిర్మాణానికి అనుమతి సరికాదు

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి మండలం నిట్టూరులో జనావాసాల మధ్య రైస్‌మిల్లు నిర్మాణానికి అనుమతి ఇవ్వడం సరికాదని గ్రామస్తులు ఆకుల శ్రీనివాస్, తాజ్, రియాజ్, లింగయ్య, గౌస్ తదితరులు ఎంపీడీవో రాజు, ఎంపీవో సుదర్శన్‌కు విన్నవించారు. మిల్లు నిర్మిస్తే దాని నుంచి వ్యర్థాలతో ప్రజలు రోగాలబారిన పడే ప్రమాదముందని తెలిపారు.

'ప్రవల్లికది ప్రభుత్వ హత్యే'

రామగుండం: ఇటీవల గ్రూప్స్ ప్రవేశ పరీక్షలు వాయిదా పడడంతో ప్రవల్లిక తీవ్ర మనస్తాపానికి గురై బలవన్మరణానికి పాల్పడిందని, ఇది ప్రభుత్వ హత్యగా భావించాల్సిందేనని ప్రగతిశీల యువజన సంఘం (పీవైఎల్) జిల్లా అధ్యక్షుడు పెండ్యాల రమేశ్ ఆరోపించారు. సోమవారం అంతర్గాం మండల కేంద్రంలో మాట్లాడారు. పరీక్షల వాయిదాతో తీవ్ర మానసిక ఒత్తిడికి గురై ఆత్మహత్యకు పాల్పడితే ప్రేమ విఫలమై మృతిచెందిందంటూ పోలీసు యంత్రాంగం కేసును పక్కదారి పట్టిస్తుండడం దుర్మార్గమైన చర్యగా అభివర్ణించారు

కొవ్వొత్తులతో నివాళి

రామగిరి: హైదరాబాద్‌లో గ్రూప్ పరీక్షలకు సిద్ధమవుతూ ప్రవల్లిక ఆత్మహత్య చేసుకోగా నిరసనగా సోమవారం సెంటనరీకాలనీలో కాంగ్రెస్ నాయకులు కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించి నివాళి అర్పించారు. మండల అధ్యక్షుడు రొడ్డ బాపు మాట్లాడారు.

కూలీలకు వేతనాలు అందించాలి

- రెండు నెలలుగా ఖమ్మంపల్లికి బస్సులు రాక ఇబ్బంది పడుతున్నాం
- సమస్యల పరిష్కారంలో అధికారులు విఫలం
- మండల సర్వసభ్య సమావేశంలో మండల ప్రజాప్రతినిధుల ఆగ్రహం



మాట్లాడుతున్న ఎంపీపీ ముత్తయ్య పటేల్

ముత్తారం: మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం జరిగిన మండల సర్వసభ్య సమావేశం వాడీవేడిగా జరిగింది. రెండునెలల నుంచి ఖమ్మంపల్లికి ఆర్టీసీ బస్సు రాకపోవడంతో విద్యార్థులు, ప్రయాణికులు, ఇబ్బందులు పడుతున్నారని మండల సర్పంచుల ఫోరం అధ్యక్షుడు అల్లం తిరుపతి వాపోయారు. రోడ్డుపూర్తిగా గుంతలమయంగా మారడంతోనే బస్సు నడపడం లేదని డిపో మేనేజర్ రాజశేఖర్ తెలిపారు. మంథని నుంచి రామకృష్ణాపూర్ మీదుగా ఖమ్మంపల్లికి బస్సు నడిపించాలని కోరగా రూట్ సర్వేచేసి నడిపిస్తామని డిపో మేనేజర్ అన్నారు. ఉపాధిహామీ పనులు చేసి నెలలు గడుస్తున్నా కూలీలకు వేతనాలు అందడం లేదని, కూలీలు సర్పంచుల ఇళ్ల చుట్టూ తిరుగుతున్నారని మండల సర్పంచుల ఫోరం అధ్యక్షుడు నూనె కుమార్, పోతారం, హరిపురం సర్పంచులు నెత్తెట్ల మహేందర్, వేల్పూరి సంపత్‌రావు ఏపీవో దయమణిని నిలదీశారు. సర్పంచులు, ఏపీవో విమర్శలు చేసుకోగా ఎంపీపీ జక్కుల ముత్తయ్యపటేల్ కల్పించుకొని కూలీలకు వేతనాలు అందేలా చూడాలన్నారు. మంథని నుంచి ఓడెడ్, జమ్మికుంట మీదుగా హనుమకొండకు వెళ్లే ఆర్టీసీ బస్సును యథావిధిగా నడపాలని ఎంపీటీసీ కిషన్‌రెడ్డి కోరగా పరిశీలిస్తామని డిపో మేనేజర్ పేర్కొన్నారు. సమావేశాల్లో స మస్యలను వినడమే తప్ప పరిష్కారంలో అధికారులు విఫలమవుతున్నారని మండల ప్రజాప్రతినిధులు ఆగ్రహం వ్యక్తంచేశారు. ఎంపీపీ ముత్తయ్య ప టే ల్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో జెడ్పీటీసీ స భ్యురాలు స్వర్ణలత అశోక్, ఎంపీడీవో శ్రీనివాస్, ఎస్సై మధుసూదన్‌రావు, వివిధశాఖల అధికారులు, ఎంపీటీసీలు, సర్పంచులు, తదితరులు పాల్గొన్నారు.

మరోసారి బీఆర్‌ఎస్‌ను గెలిపించేందుకు సిద్ధం

- పెద్దపల్లి ఎమ్మెల్యే దాసరి మనోహర్ రెడ్డి
- పలుగ్రామాల్లో ఎన్నికల ప్రచారం



ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డికి మంగళహారతులతో స్వాగతం పలుకుతున్న మహిళలు

కాల్వశ్రీరాంపూర్: కాంగ్రెస్ హయాంలో రైతులు పొట్టకూటి కోసం గల్ఫ్‌కు వెళితే ప్రత్యేక రాష్ట్రంలో ప్రాజెక్టుల నీటితో పంటలు పండిస్తూ రై తులు ఆనందంగా ఉన్నారని పెద్దపల్లి ఎమ్మెల్యే దాసరి మనోహర్ రెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని మీర్జంపేట, కిష్టపేట, మొట్లపల్లి గ్రామాల్లో ఇంటింటి ప్రచారం చేస్తూ ఓట్లు అభ్యర్థించారు. నియోజకవర్గంలో లింకురోడ్లు, గ్రామాల్లో అంతర్గత రహదారులు, సీసీరోడ్లు, రైతు వేదికలు, పాఠశాలల్లో అదనపు తరగతి గదులు నిర్మాణాలతో పురోగతి సాధించినట్లు పేర్కొన్నారు. అన్ని గ్రామాల్లో ప్రజలు మరోసారి బీఆర్‌ఎస్‌కే పట్టం కట్టేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. నియోజకవర్గంలో ప్రజలు కారు గుర్తుకు ఓటువేసి భారీ మెజార్టీతో గెలిపించాలన్నారు. ఆయాగ్రామాల్లో మహిళలు మంగళహారతులతో స్వాగతం పలికారు. సర్పంచులు, రైతులు గజమాలతో సన్మానించారు. కార్యక్రమంలో ఎంపీపీ నూనేటి సంపత్ యాదవ్, జెడ్పీటీసీ తిరుపతి రెడ్డి, రైతు సమన్వయ సమితి మండల అధ్యక్షుడు దేవయ్య, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు రాజ కొమురయ్య, ఆయాగ్రామాల సర్పంచులు నాగార్జున రావు, తిరుపతి రెడ్డి, గోనె శ్యాం, ఎంపీటీసీ కౌసల్య, కార్యకర్తలు, మహిళలు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ పథకాలతో ఇంటింటా లబ్ధి

ఓదెల(పెద్దపల్లి): కాంగ్రెస్‌కు ఓటేస్తే కైలాసం ఆటలో పాము మింగినట్లేనని పెద్దపల్లి ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి తనయుడు దాసరి ప్రశాంత్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం ఓదెల మండలం ఇందుర్తిలో ఇంటింటా ప్రచారం చేశారు. బీఆర్‌ఎస్ సర్కార్ ఆధ్వర్యంలో ఇంటింటా పథకాలు దరి చేరుతున్నాయని వివరించారు. కార్యక్రమంలో పెద్దపల్లి మార్కెట్ వైస్‌చైర్మన్ ఐరెడ్డి వెంకటరెడ్డి, సర్పంచు అంబాల సంధ్యారాణి శ్రీనివాస్, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక 'బతుకమ్మ'



పెద్దపల్లి రూరల్ : గాయత్రీ కళాశాలలో బతుకమ్మ ఆడుతున్న విద్యార్థినులు, అధ్యాపకులు



సుల్తానాబాద్ : శ్రీవాణి కళాశాలలో..



పెద్దపల్లి రూరల్ : బతుకమ్మలతో ప్రిన్సిపాల్, విద్యార్థినులు

సుల్తానాబాద్: తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా బతుకమ్మ పండుగ నిలుస్తుందని శ్రీవాణి కళాశాల డైరెక్టర్ రేకులపల్లి సుష్మ అన్నారు. సోమవారం మండలకేంద్రంలోని శ్రీవాణి జూనియర్, డిగ్రీ, పీజీ కళాశాలలో బతుకమ్మ వేడుకలు నిర్వహించారు. తీరొక్క పూలతో బతుకమ్మ పేర్చి విద్యార్థినులు ఆడిపాడారు. బతుకమ్మలను అందంగా పేర్చి తీసుకువచ్చిన విద్యార్థినులకు బహుమతులు ప్రదానం చేశారను. కార్యక్రమంలో కళాశాల సెక్రటరీ కరస్పాండెంట్ రేకులపల్లి శశాంక కళాశాల ప్రిన్సిపాల్స్ బండారి కమలాకర్, బాలసాని శ్రీనివాస్ అధ్యాపకులు, పాల్గొన్నారు.

ప్రభుత్వ జూనియర్ కళాశాలలో

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో బతుకమ్మ వేడుకలను జరుపుకున్నారు. ప్రిన్సిపాల్ మైత్రేయి, అధ్యాపకులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

గాయత్రీ కళాశాలలో..

పెద్దపల్లిలోని గాయత్రీ డిగ్రీ, పిజీ కళాశాలలో బతుకమ్మ వేడుకలు జరుపుకున్నారు. విద్యాసంస్థల అధినేత అల్లెంకి శ్రీనివాస్, రజనీ, ప్రిన్సిపాల్ రవీందర్, అధ్యాపకులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

డీసీసీ కార్యదర్శిగా రాజలింగం



రాజలింగంను సన్మానిస్తున్న విజయ రమణారావు

సుల్తానాబాద్: పట్టణానికి చెందిన అమిరిశెట్టి రాజలింగంను జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యదర్శిగా నియమిస్తూ జిల్లా అధ్యక్షుడు మక్కాన్ సింగ్ ఉత్తర్వులు జారీచేశారు. సోమవారం మాజీ ఎమ్మెల్యే విజయరమణారావు రాజలింగంను ఘనంగా సన్మానించారు. తన నియామకానికి సహకరించిన విజయ రమణారావు, ఎమ్మెల్యే శ్రీధర్ బాబు, జిల్లా అధ్యక్షుడు మక్కాన్ సింగ్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

బీఎస్పీ ప్రచారం

జూలపల్లి: బడుగు బలహీన వర్గాలకు రాజ్యాధికారం రావాలంటే బీఎస్పీకి ఓటువేయాలని బీఎస్పీ గ్రామశాఖ ఇన్‌చార్జి కత్తెర్ల లక్ష్మయ్య కోరారు. మండలంలోని తెలుకుంటలో పార్టీ నాయకులు, మహిళలతో కలిసి ఇంటింటా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. అనంతరం కరపత్రాలు పంపిణీ చేశారు. అనూజ, రమ్య, మాధవి, మహేశ్వరి, స్వర్ణలత తదితరులున్నారు.

నిరుపేదలకు అండగా బీఆర్‌ఎస్

సుల్తానాబాద్‌రూరల్: నిరుపేదలకు బీఆర్‌ఎస్ అండగా ఉంటుందని రైతుబంధు సమితి జిల్లా మాజీ కోఆర్డినేటర్ కాసర్ల అనంతరెడ్డి అన్నారు. సోమవారం సుల్తానాబాద్ మండలం సుద్దాల గ్రామంలో ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఎమ్మెల్యేగా దాసరి మనోహర్‌రెడ్డికి మూడోసారి అవకాశం కల్పించాలని కోరారు. సర్పంచ్ అంజలి, ఎంపీటీసీ నిర్మల, తెలంగాణ జాగృతి కన్వీనర్ బొంకూరి ఐలయ్య, నాయకులు పాల్గొన్నారు.

కాల్వ పూడ్చివేతపై రైతుల ఆందోళన

సుల్తానాబాద్‌రూరల్: మండలంలోని కదంబాపూర్ గ్రామ శివారులో డీ–86 ఉప కాల్వను పూడ్చివేయడంతో తమ పొలాలకు ఎస్సారెస్పీ నీళ్లు రావడంలేదని సోమవారం రైతులు ఆందోళన చేశారు. కదంబాపూర్ శివారులో తారుప్లాంట్ యాజమాన్యం ఎస్సారెస్పీ కాల్వను పూడ్చివేసిందని, దీంతో పంటపొలాలకు నీరందక ఎండిపోతున్నాయని రైతులు పేర్కొన్నారు. దీనిపై ఎస్సారెస్పీ అధికారులు విచారణ చేపట్టి తగు చర్యలు తీసుకోవాలని కోరారు. ఆందోళనలో రైతులు గొస్కుల సదయ్య, రాజయ్య, రవి, కొమురయ్య, ఐలయ్య, తదితరులున్నారు.

నేడు అవగాహన సదస్సు

కోల్‌సిటీ: గోదావరిఖనిలోని ప్రభుత్వ సిమ్స్ మెడికల్ కళాశాలలో మంగళవారం మెడికోల కోసం వివిధ విభాగాలపై అవగాహన సదస్సు ఏర్పాటు చేసినట్లు కళాశాల ప్రిన్సిపాల్ హిమబిందు సింగ్ తెలిపారు. జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్, రామగుండం పోలీస్ కమిషనర్ రెమారాజేశ్వరి హాజరుకానున్నారన్నారు.

పోలింగ్‌కేంద్రాల పరిశీలన

జూలపల్లి: మండలకేంద్రంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేయనున్న పోలింగ్ కేంద్రాలను తహసీల్దార్ బషీరొద్దీన్ సోమవారం పరిశీలించారు. పోలింగ్‌కేంద్రాల్లో సౌకర్యాలు, దివ్యాంగుల కోసం ప్రత్యేక ఏర్పాట్లను పరిశీలించి పలు సూచనలు చేశారు. ఆయనవెంట ఎంపీవో కిరణ్, పంచాయతీ రాజ్ ఏఈ సుమలత తదితరులున్నారు.

విద్యార్థుల్లో సృజనాత్మకతను గుర్తించాలి



మాట్లాడుతున్న ఎంఈవో సంపత్ రావు

యైటింక్లయిన్‌కాలనీ: విద్యార్థుల్లో ఉన్న సృజనాత్మకతను గుర్తించి వారి లక్ష్య సాధనకు ఉపాధ్యాయులు మార్గదర్శకులుగా ఉండాలని రామగుండం ఎంఈవో సంపత్ రావు అన్నారు. సోమవారం యైటింక్లయిన్‌కాలనీలో ఎస్ఎంఎస్ స్కూల్స్ ఆధ్వర్యంలో నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. విద్యార్థులకు కార్పొరేట్ విద్య అందించాలనే ఉద్దేశంతో 6 నుంచి పదో తరగతి వరకు బోధించే ఉపాధ్యాయులకు సీసీఈ ప్యాటర్న్‌పై సబ్జెక్టుల రిసోర్స్ నిపుణులు నంది శ్రీనివాస్, ఒమర్ అలీ, ముకుందం, దేవదాస్, సోయల్ జోసెఫ్, ఓదెల్ కుమార్, కిరణ్ కుమార్‌తో ఒక రోజు శిక్షణ తరగతులు నిర్వహించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో ఎస్ఎంఎస్ స్కూల్స్ ఆఫ్ గ్రూప్ పాఠశాలల నిర్వాహకులు, యాదగిరి గౌడ్, సిద్ధయ్య, కేశవరెడ్డి, బుచ్చిరెడ్డి, ఓదెల్ యాదవ్, ఉమ మహేశ్వర్, రవి, రవీందర్ రావు, తదితరులు పాల్గొన్నారు.

పదవులు అనుభవించి పార్టీలు మారుతారా ?



మాట్లాడుతున్న నాయకులు

మంథని: జెడ్పీ చైర్మన్ పుట్ట మధు చొరవతో పదవులు అనుభవించి పార్టీలు మారడం ఎంతవరకు సమంజమని బీఆర్‌ఎస్ యువజన విభాగం మండల శాఖ అధ్యక్షుడు కొండ రవీందర్ అన్నారు. సోమవారం ప్రెస్‌క్లబ్‌లో బీఆర్‌ఎస్ నాయకులతో కలిసి ఆయన మాట్లాడారు. సర్పంచ్‌గా గెలువలేని కొండశంకర్‌ను ఎంపీపీగా గెలిపిస్తే నమ్మకద్రోహం చేస్తారా అన్నారు. ప్రజలు అన్ని గమనిస్తున్నారని పుట్ట మధుకు వస్తున్న ప్రజాదరణను ప్రతిపక్షాలు ఓర్వడం లేదన్నారు. మండల అధికార ప్రతినిధి మంథని లక్ష్మణ్, ఏఎంసీ డైరెక్టర్ వేల్పుల గట్టయ్య, నాయకులు శ్రీకాంత్, సది, కాసిపేట ప్రణీత్, సాంబయ్య, బర్ల సుధాకర్, కారంగుల సురేశ్, మంత్రి వెంకటేశ్, తదితరులు పాల్గొన్నారు.

వివిధ రూపాల్లో అమ్మవారి దర్శనం



జూలపల్లి: పూజల్లో పాల్గొన్న భక్తులు

జూలపల్లి: మండలకేంద్రంతో పాటు గ్రామాల్లో దేవీ శరన్నవరాత్రుల్లో భాగంగా దుర్గా దేవీ రెండోరోజు బాలా త్రిపురసుందరి దేవీగా భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా పూజారులు అమ్మవారికి ప్రత్యేకపూజలు చేసి భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

గాయత్రీ దేవిగా..

కాల్వశ్రీరాంపూర్: మండలకేంద్రంతోపాటు పలు గ్రామాల్లో దేవీ నవరాత్రోత్సవాల్లో భాగంగా అమ్మవారు గాయత్రీ దేవి అలంకరణగా దర్శనమిచ్చారు. భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

కుంకుమపూజలు

ఫెర్టిలైజర్‌సిటీ: దేవీ నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా రామగుండం కార్పొరేషన్ 39వ డివిజన్ గౌతమినగర్‌లో సోమవారం దుర్గాదేవీ మండపంలో అర్చకులు కర్ణె అశోక్ శర్మ ఆధ్వర్యంలో కుంకుమార్చన నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

మానవత్వం చాటి.. పుస్తెలతాడు అందజేసి

ముత్తారం: మండలంలోని సర్వారంలో గతనెల 28న సజ్జనపు మమత మెడలోంచి రాజ్‌కుమార్ అనే వ్యక్తి పుస్తెలతాడును దొంగిలించగా చెరువులో పడి అతడు చనిపోయాడు. గ్రామస్తులు రూ.48వేల విలువగల పుస్తెలతాడును అందజేసి మానవత్వం చాటుకున్నారు. ఈ సందర్భంగా వారికి మమత, శ్రీనివాస్ దంపతులు కృతజ్ఞతలు తెలిపారు.

బీఆర్‌ఎస్‌కు అండగా నిలవాలి



వృద్ధురాలిని ఓటు అభ్యర్థిస్తున్న మమతా రెడ్డి



సుల్తానాబాద్ : పూసాలలో ..



పెద్దపల్లి రూరల్ : రాఘవాపూర్‌లో ప్రచారం చేస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

పెద్దపల్లిరూరల్: రానున్న ఎన్నికల్లో బీఆర్‌ఎస్ పార్టీకి మద్దతిచ్చి అండగా నిలవాలని కాంగ్రెస్ పార్టీ మైనార్టీ రాష్ట్ర నాయకుడు సయ్యద్ మస్రత్‌ను మున్సిపల్ చైర్మన్ మమతారెడ్డి కోరారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా సోమవారం రంగంపల్లి, బండారికుంట, ఫారెస్ట్‌స్ట్రీట్ ప్రాంతాల్లో తిరుగుతూ ఓట్లు అభ్యర్థించారు. అన్నివర్గాల సంక్షేమానికి కృషిచేస్తున్న బీఆర్‌ఎస్‌కే ఓటు వేయాలని కోరారు. వృద్ధులతో ఆప్యాయంగా పలుకరించి పింఛన్ వస్తుందా అని అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో నాయకులు ఉప్పు రాజ్‌కుమార్, మొబిన్, రవి, ప్రశాంత్ తదితరులున్నారు.

రాఘవాపూర్‌లో..

బీఆర్‌ఎస్ పాలనలో ఎన్నో సంక్షేమ పథకాలను అమలవుతున్నాయని పార్టీ మండల అధ్యక్షుడు మర్కు లక్ష్మణ్ అన్నారు. మండలంలోని రాఘవాపూర్‌లో సోమవారం ఇంటింటి ప్రచారం ని ర్వహించారు. రానున్న ఎన్నికల్లో మరోసారి దాసరి మనోహర్‌రెడ్డిని ఎమ్మెల్యేగా గెలిపించాలన్నారు. నాయకులు శ్రీనివాస్, రాజయ్య, తదితరులున్నారు.

జనరంజకంగా ఎన్నికల మేనిఫెస్టో

సుల్తానాబాద్: బీఆర్‌ఎస్ ఎన్నికల మేనిఫెస్టో జనరంజకంగా ఉందని మున్సిపల్ చైర్‌పర్సన్ ముత్యం సునీత అన్నారు. సోమవారం పట్టణంలోని పూసాలలో రానున్న ఎనిక్నల్లో మరోసారి ఎమ్మెల్యే దాసరి మనోహర్ రెడ్డి గెలుపునకు కృషి చేయాలన్నారు. సబ్బండ వర్గాలకు లబ్ధిచేకూరేలా మేనిఫెస్టో రూపొందిచారన్నారు. కౌన్సిలర్లు గుర్రాల శ్రీనివాస్, కూకట్ల గోపి, తిరుపతి, పసెడ్ల మమత, సంపత్, సాజిత్ పట్టణ అధ్యక్షుడు పారుపల్లి గుణపతి, ముత్యం రమేశ్ గౌడ్, సహా పలువురు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌తోనే నియోజకవర్గ అభివృద్ధి



ఎల్కలపల్లి గేట్‌లో ప్రచారం చేస్తున్న నాయకులు



ప్రచారంలో పాల్గొన్న కాంగ్రెస్ నాయకులు

ఫెర్టిలైజర్‌సిటీ: రామగుండం కార్పొరేషన్ 14వ డివిజన్ ఎల్కలపల్లిగేట్‌లో సోమవారం కాంగ్రెస్ ప్రవేశపెట్టిన ఆరు గ్యారంటీ పథకాలపై పార్టీ క్లస్టర్ ఇన్‌చార్జి బుర్ల శ్రీనివాస్, ఎల్కలపల్లి గేట్ గ్రామపంచాయతీ కాంగ్రెస్ ఇన్‌చార్జి మానాల ప్రభాకర్ ప్రచారం నిర్వహించారు. నియోజకవర్గం అభివృద్ధి చెందాలంటే రాజ్‌ఠాకూర్ మక్కాన్‌సింగ్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలన్నారు. బండారి శంకరయ్య, రవి, గుండా రాకేశ్, రాయమల్లు, పాల్గొన్నారు.

యైటింక్లయిన్‌కాలనీ: యైటింక్లయిన్‌కాలనీ 17వ డివిజన్ ఏరియాలో కాలనీ కాంగ్రెస్ పార్టీ నాయకుడు ఇంటింటా ప్రచారం నిర్వహించారు. కాలనీ పట్టణ అధ్యక్షుడు గుండేటి రాజేశ్ నాయకులతో కలిసి ఇంటింటా తిరుగుతూ ఆరు గ్యారంటీ పథకాలపై వివరించారు. కాంగ్రెస్‌కు ఓటువేసి మక్కాన్ సింగ్ రాజ్ ఠాగూర్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలన్నారు. కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు కిషన్ నాయక్, రాములు. యాదగిరి తిరుపతి, నరేశ్, మహేశ్, అవినాశ్, అనిత, సమ్మయ్య, శంకర్, కిరణ్, సంతోష్, తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ నాయకుల సంబరాలు



సంబరాల్లో పాల్గొన్న బీఆర్‌ఎస్ నాయకులు

ఎలిగేడు: బీఆర్‌ఎస్ అధినేత, సీఎం కేసీఆర్ ఎన్నికల మేనిఫెస్టో విడుదల చేయడంపై ఎలిగేడు సోమవారం మండల కేంద్రంలో బీఆర్‌ఎస్ శ్రేణులు సోమవారం సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా పటాకులు పేల్చి స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ స్రవంతి, జెడ్పీ వైస్ చైర్‌పర్సన్ రేణుక, మండల సర్పంచుల ఫోరం అధ్యక్షుడు మాడ కొండల్‌రెడ్డి, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు రాంరెడ్డి, ప్రవీణ్, సతీశ్, సాయినాథ్, తదితరులు పాల్గొన్నారు.

పోగొట్టుకున్న నల్లపూసల తాడు అందజేత

గోదావరిఖని: ఓ మహిళ పోగొట్టుకున్న నల్లపూసల తాడును పోలీసులు అందజేశారు. లక్ష్మీనగర్ ఏరియాలోని గోల్డ్‌షాప్‌లో ఆదివారం గౌరి అనే మహిళ నల్లపూసల తాడును కొనుగోలు చేసింది. నడుచుకుంటూ వెళ్తుండగా, మార్గమధ్యంలో నల్లపూసల తాడును పోగొట్టుకుంది. గోదావరిఖని వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా క్రైం టీం సిబ్బంది తీట్ల శ్రీనివాస్, గోపతి వెంకటేశ్ సీసీ పుటేజీని పరిశీలించారు. లక్ష్మీనగర్ ఏరియాలో సీసీ కెమెరాల ఆధారంగా గుర్తించి బాధిత మహిళకు నల్లపూసల తాడును అందజేశారు. పోగొట్టుకున్న బంగారు గొలుసును అప్పగించిన పోలీసులకు ఆమె కృతజ్ఞతలు తెలిపారు.

బడుగు బలహీన వర్గాల అభ్యున్నతే లక్ష్యం



బీఎస్పీలో చేరిన వారితో దాసరి ఉష

పెద్దపల్లిరూరల్: బడుగు, బలహీనవర్గాల అభ్యున్నతే లక్ష్యంగా పనిచేసేందుకే ఎన్నికల బరిలో దిగుతున్నానని బీఎస్పీ నియోజకవర్గ ఇన్‌చార్జి దాసరి ఉష అన్నారు. నియోజకవర్గంలోని ఓదెల, కాల్వశ్రీరాంపూర్, పెద్దపల్లి మండలాల్లోని పలు గ్రామాలకు చెందిన నాయకులు సోమవారం బీఎస్పీలో చేరగా వారికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. బీఆర్‌ఎస్ అవినీతి పాలనకు చరమగీతం పాడి బీఎస్పీని ఆదరించాలని కోరారు. నాయకులు లక్ష్మయ్య, మహేశ్, రాజ్‌కుమార్, శ్రీనివాస్, రాజు, లింగయ్య, మహేందర్, సందీప్‌కుమార్, రాజయ్య తదితరులున్నారు.